క్లుప్తంగా

నేడు దివ్యాంగులకు పరికరాల పంపిణీ

కమలాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు దివ్యాంగులు, వయో వృద్ధులకు సహాయ పరికరాల పంపిణీ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కెజియా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కమలాపురం, వల్లూరు మండలాలకు చెందిన దివ్యాంగులు, వయో వృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమకు కావలసిన పరికరాలు పొంద వచ్చన్నారు. వీరు ఆధార్ కార్డు, సదరన్ సర్టిఫికెట్, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకు రావాలని సూచించారు. చేతి కర్రలు, వాకర్లు, మూడు కాళ్ల చేతి కర్రలు, చంక కర్రలు, వీల్‌ఛైర్లు, తోపుడు బండ్లు, వినికిడి యంత్రాలు, బ్యాటరీ సైకిల్స్, ట్రై సైకిల్స్, రోలేటర్స్ అందిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట



బండలాగుడు పోటీల్లో పాల్గొన్న ఎద్దులు

కొండాపురం: మండల పరిధిలోని లావనూరు గ్రామంలో సోమవారం కోదండరామ స్వామి ఆలయ ధ్వజ స్తంభం, నూతన విగ్రహ ప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. సుముహూర్తంలో ఆలయంలో సీతా,రామ, లక్ష్మణ, ఆంజనేయ మూలవిరాట్లను అర్చకులు వేదమంత్రాలు వల్లిస్తూ శాస్త్రోపేతంగా నిర్వహించారు. అరుపండ్లు ఎద్దులతో బండలాగుడు పోటీలు నిర్వహించారు. బండలాగుడు పోటీల్లో మొదటి బహుమతి రూ. 50 వేలు రెండవ బహుమతి రూ. 40 వేలు,మూడవ బహుమతి రూ. 30 వేలు నాల్గవ బహుమతులు గెలిచి ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పంటలు కాపాడండి

ముద్దనూరు: గాలేరు-నగరి ప్రధాన కాలువ, వామికొండ జలాశయం ద్వారా పరిసర ప్రాంతాల రైతులకు సాగునీరందించి ఎండుతున్న పంటలను కాపాడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన రైతులలో కలిసి చెరువులు, వంకలకు నీరందించాలని కోరుతూ గాలేరు-నగరి కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ వామికొండ రిజర్వాయర్ ఉపకాలువల నిర్మాణం పూర్తి చేసి ఉంటే పంటలు ఎండిపోయేవి కావని చెప్పారు. ప్రధాన కాలువ గ్రావిటీ ద్వారా పెనికలపాడు, చిలంకూరు చెరువులను నింపాలని కోరారు. రైతులకు ఉపశమనం కలిగేలా తాత్కాలిక చర్యలు తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు.

ముగిసిన భాగవత సప్తాహం



భాగవత పఠనం చేస్తున్న పండితులు

సింహాద్రిపురం : మండలంలోని కసనూరు గ్రామంలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో సోమవారం భాగవత సప్తాహ పఠనం ముగిసింది. పులివెందుల భక్త సమాజ మండలి నిర్వహణలో గ్రామస్తులు, దాతల సహకారాలతో దిగ్విజయంగా నిర్వహించారు. మంత్ర పుష్పం, ఆలయం చుట్టూ కలశ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం భాగవత పండితులను సత్కరించారు. కార్యక్రమంలో భాగవత భక్త సమాజ మండలి అధ్యక్షుడు చిన్న శివారెడ్డి, నారాయణరెడ్డి, పాపిరెడ్డి, రంగనాథ్, సభ్యులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రానికి రూ. లక్ష విరాళం



అన్నదాన సత్రానికి విరాళం అందిస్తున్న కౌన్సిలర్ కోడి రమణ తదితరులు

పులివెందుల : మైదుకూరు నియోజకవర్గంలోని బ్రహ్మంగారి మఠంలో ఉన్న పట్రా నాయుళ్ల అన్నదాన సత్రానికి సోమవారం పులివెందుల మున్సిపల్ కౌన్సిలర్ సోకే వెంకట రమణ (కోడి రమణ) లక్ష రూపాయల విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ అన్ని దానాలకన్నా అన్నదానం మిన్న అని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు బ్రహ్మంగారిని దర్శించుకునేందుకు వస్తుంటారని, అటువంటివారి ఆకలి తీర్చడ పుణ్యకార్యమని చెప్పారు. కార్యక్రమంలో పట్రా కుల సంఘం నాయకులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

లింగాల : లింగాల మండలం గుణగణపల్లె గ్రామంలో సోమవారం బెల్ట్ షాపులపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గండికోట రాయుడు అనే వ్యక్తి ఇంట్లో 10 అక్రమ మద్యం బాటిళ్లు ఉన్నట్లు గుర్తించారు. అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులో 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని గండికోట రాయుడును అరెస్టు చేశామని ఏఎస్ఐ రాజు తెలిపారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపిద్దాం

- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి



ప్రచారం చేస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు

పులివెందుల : వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థిని అఖండ మెజార్టీతో గెలిపిద్దామని ఎంపీ అవినాష్ రెడ్డి పిలుపునిచ్చారు. పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికకు సంబంధించి వైఎస్సార్‌సీపీ సోమవారం నుంచి ఎన్నికల ప్రచారం మొదలుపెట్టింది. ఈ ప్రచారానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. సోమవారం మధ్యాహ్నం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి అచ్చివెళ్లి గంగమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేసి అనంతరం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకమైన పరిస్థితుల్లో ఈ ఉప ఎన్నిక వచ్చిందని, ఈ ఉప ఎన్నిక నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి టీడీపీ యొక్క బిహేవియర్ ఏమిటనేది, వాళ్ల నాయకుల బిహేవియర్ అనేది ఈ మండల ప్రజలు, జిల్లా ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా బీటెక్ రవికి తోడు ఆదినారాయణరెడ్డి, సీఎం రమేష్, శ్రీనివాసులరెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి సవితమ్మ, ఎంతోమంది నాయకులు, కార్యకర్తలు అండగా ఉండవచ్చునని, వీరందరి ధ్యేయం మా ఊరిని నాశనం చేయడం ఇది ప్రజలకు అర్థమైందన్నారు.

ప్రజలు బుద్ధి చెబుతారు

ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ పులివెందుల మండల జెడ్పీటీసీకి ఎన్నిక జరుగుతోందని, ఈ రోజు కనీసం ఒక అభ్యర్థిగా 10,600 ఓటర్లలో ఒక్కరిని కూడా అభ్యర్థిగా నిలబెట్టలేని పరిస్థితిలో కూటమి ప్రభుత్వం ఉందంటే దానికి కారణం.. ఈ రోజు మొట్టమొదట వారి ఓటమిని తెలియజేస్తోందన్నారు. ఇక్కడ ఎవరిని పోటీ పెట్టే అభ్యర్థే లేని పరిస్థితిలో సింహాద్రిపురం మండలం నుంచి అభ్యర్థిని పెట్టి వీరందరూ కూడా ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. ఇలా మోసం చేసి ఓట్లు వేయించుకున్న వారికి తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

పులివెందుల గడ్డ వైఎస్సార్ అడ్డా

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ పులివెందుల గడ్డ.. వైఎస్ రాజశేఖరరెడ్డి అడ్డా స్పష్టం చేశారు. ఇక్కడి ప్రజలకు సుఖాల్లోనే వైఎస్ కుటుంబం అండగా నిలిచిందని తెలిపారు. వైఎస్సార్ తదనంతరం మాజీ సీఎం వైఎస్ జగన్, తర్వాత అవినాష్‌రెడ్డి ప్రజలతోనే ఉన్నారని తెలిపారు. ఎన్నికల్లో అన్యాయంగా వ్యవహరిస్తే జరిగే ప్రతి కార్యక్రమానికి కూటమి నాయకులు బాధ్యత వహించాలని హెచ్చరించారు. జెడ్పీటీసీ అభ్యర్థి హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికలలో వందకు వందశాతం గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఊపందుకున్న ఎన్నికల ప్రచారం

పులివెందుల టౌన్ : పులివెందుల జెడ్పీటీసీ ఎన్నికకు సంబంధించి మండలంలోని మోట్నూతలపల్లె గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, వైఎస్సార్‌సీపీ మండల పరిశీలకులు బలరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వేల్పుల రామలింగారెడ్డి, మరకా శివకృష్ణారెడ్డిలతో పాటు ఆయా గ్రామ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి హేమంత్ రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14 నెలలవుతున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ఇచ్చిన హామీలను నెరవేర్చుకోవాలంటే వైఎస్సార్‌సీపీకి ఓట్లు వేసి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు, కార్యకర్తలు, శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



మహిళలను ఆత్మీయంగా పలకరిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రచారం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి



మహిళను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్ తదితరులు

పోలింగ్ కేంద్రాల్లో కట్టుదిట్టమైన చర్యలు



పులివెందుల టౌన్ : అన్ని పోలింగ్ కేంద్రాల్లో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టామని ఆర్డీఓ చిన్నయ్య పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు, పోలింగ్ అధికారులు, పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ చిన్నయ్య మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రలోభాలకు గురి చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు అధికారుల పరిరక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పులివెందుల డీఎస్పీ మురళి నాయక్, తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం

లింగాల : మండలంలోని పెద్దకుడాల, కామసముద్రం, అంకేవానిపల్లె గ్రామాల్లో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత, కృష్ణాష్టమి ఊరేగింపు విశిష్టతపై ధర్మ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందు జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు వరుణ్ కుమార్ దేవుడే అవతరించి ఒక మనిషిగా జన్మిస్తే ఆయనను భగవంతుడు అని అంటామన్నారు. అలాంటి భగవంతుడే శ్రీకృష్ణుడు ని, ఆయనను మాత్రమే అందరూ దైవంగా గుర్తించాలన్నారు. కార్యక్రమంతో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు మహేశ్వర రెడ్డి, గురుమూర్తి, వెంకటయ్య , ఎల్లటూరు నరసింహ, ఆదిలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



కమలాపురం: మాట్లాడుతున్న డాక్టర్ మాహినూర్, సీడీపీఓ శ్రీలత



జమ్మలమడుగు: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కమలాపురం: తల్లి పాలతో బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటాడని పెద్దచెప్పలి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ మాహినూర్ తెలిపారు. సోమవారం పెద్దచెప్పలి పీహెచ్‌సీలో ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీలత ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపే ముర్రు పాలు తాపించాలని సూచించారు. తల్లిపాలు తాపించడం వలన బిడ్డకు, తల్లికి మధ్య అనుబంధం పెరుగుతుందన్నారు. సీడీపీఓ శ్రీలత మాట్లాడుతూ బిడ్డకు ఆరు మాసాలు వచ్చే వరకు తల్లిపాలే శ్రేష్టమన్నారు. అనంతరం అనుబంధ పౌష్టికాహారం అందించాలని తెలిపారు. గర్భం దాల్చినప్పటి నుంచి పిల్లలకు మూడేళ్లు వచ్చే వరకు ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారం అందిస్తామని, పిల్లల తల్లులు, గర్భిణులు, బాలింతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆశాలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

జమ్మలమడుగు: బిడ్డకు తల్లిపాలే శ్రేయస్కరమని డాక్టర్ చరితారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఎర్రగుంట్ల మండలంలోని చిలంకూరు గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు తల్లి పాలు తాగించడం వలన రోగ నిరోధకశక్తి పెరుగుతుందని చెప్పారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి పాలు తాగించాలని సూచించారు. పుట్టిన ఆరు నెలల వరకు తల్లిపాలు ఇవ్వాలని, రెండు సంవత్సరాల వరకు తాపించాలని తెలిపారు. రొమ్ము క్యాన్సర్ రాకుండ నివారించవచ్చు అని తెలిపారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల రొమ్ము కణజాలం బహిర్గతం కాకుండా ఉంటుందని, అందువల్ల క్యాన్సర్ ప్రమాదం తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి పార్వతమ్మ, ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

పని తగ్గ వేతనం ఇవ్వాలి



అధికారులకు సెల్‌ఫోన్‌లను అప్పగిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

ముద్దనూరు: అంగన్వాడీ టీచర్లపై సెల్‌ఫోన్‌లు, యాప్‌ల పేరుతో పనిభారం పెంచారని, పనికి తగిన వేతనం అందించలేదని అంగన్వాడీ టీచర్లు సోమవారం స్థానిక ఐసీడీయస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముద్దనూరు, యర్రగుంట్ల, కొండాపురం మండలాలకు చెందిన అంగన్వాడీ టీచర్లు పనిచేయని సెల్‌ఫోన్లను ఐసీడీఎస్ అధికారులకు అందజేశారు. ఈ నిరసనలో సీఐటీయూకు చెందిన జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి ,ప్రాజెక్టు అధ్యక్షులు ప్రమీల, ప్రాజెక్టు అధ్యక్షులు శిరీష మాట్లాడుతూ సెల్‌ఫోన్ యాప్‌లతో పనిభారం పెరిగిందని, దానికి తగిన వేతనం పెంచాలని కోరినా స్పందన లేదని విమర్శించారు. ఈ యాప్‌ల నిర్వహణలో సిబ్బందిపై ఆర్థికభారం పెరుగుతోందని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ట



ధ్వజస్తంభాన్ని ప్రతిష్టస్తున్న దృశ్యం

సింహాద్రిపురం : మండలంలోని కసనూరు గ్రామంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం వేద మంత్రోచ్ఛారణ మధ్య ధ్వజ స్తంభ ప్రతిష్ట నిర్వహించారు. ఆలయ అర్చకులు జానకిరాం శర్మ, రవీంద్రనాథ స్వామి ఆధ్వర్యంలో డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి కుటుంబ సభ్యులు, దాతల సహకారంతో ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. ఆళ్లగడ్డ నుంచి 18 టన్నుల బరువు గల 18 అడుగుల రాతి ధ్వజస్తంభాని రెండు ప్రొక్లెయినర్లతో ఏర్పాటు చేశారు. అలాగే గ్రామ దేవత పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట, యంత్ర, ప్రాణ ప్రతిష్టాపన పూజలు నిర్వహించారు.

పులివెందులకు, చంద్రబాబు నీచత్వానికి పోటీ!



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు చిత్రంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

పులివెందుల: వైఎస్సార్‌సీపీ కడప జిల్లా పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలు పులివెందులకు, చంద్రబాబు నీచత్వానికి మధ్య పోటీ అని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అన్నారు. సోమవారం పులివెందులలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల మండలానికి సంబంధించిన జెడ్పీటీసీ ఉప ఎన్నికకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అనేక రకాలైన మాటలు వినిపిస్తున్నాయని, ఫలితం కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రజలందరికీ విజ్ఞప్తి చేస్తున్నది ఒక్కటేనని, 1978లో రాజకీయాలను వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించారని, రెండేళ్లు ఆగితే 50ఏళ్లు పూర్తవుతుందని.. గడిచిన 50ఏళ్ల కాలంలో వైఎస్ రాజశేఖరరెడ్డి కానీ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కానీ, వారి కుటుంబం కానీ, వారికి కేటాయించిన గుర్తుపైన పోటీ చేసిన ఏ ఎన్నికలలో కూడా ఇంతవరకు ఓటమి పొందలేదని గుర్తుచేశారు.

మానవత్వం మరిచి..

గతంలో జెడ్పీటీసీగా పనిచేసిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మహేశ్వరరెడ్డి ప్రమాదవశాత్తు అకాల మరణం పొందడంతో ఉప ఎన్నికలు వచ్చాయన్నారు. అయితే సంప్రదాయం ప్రకారం పెద్ద, పెద్ద ఎన్నికలకు కూడా ఏ రాజకీయ పార్టీ పోటీ పెట్టదని, కానీ ఈరోజు ఆ పరిస్థితికి కూటమి నాయకులు తిలోదకాలిచ్చారని మండిపడ్డారు. మానవత్వం మరిచి విపరీతమైన అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

బలంతో విర్రవీగుతున్నారు

టీడీపీ బలం ఇక్కడ నామమాత్రమేనని, సార్వత్రిక ఎన్నికల్లో పులివెందుల రూరల్ మండలానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ బలమైన మెజారిటీ సాధించిందని రాచమల్లు అన్నారు. అయినా ఇపుడు జెడ్పీటీసీ ఎన్నికకు టీడీపీ పోటీ చేసి గెలవబోతున్నామని డాంబికాలు పలుకుతున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ ధనాన్ని, పోలీసులను నమ్మి పోటీ చేస్తోందన్నారు. డబ్బుతో నాయకులను కొనుగోలు చేయడం, పోలీసులతో వైఎస్సార్ సీపీ శ్రేణులను బైండోవర్ కేసుల పేరుతో ఇబ్బందులు పెడుతున్నారని, అర్ధరాత్రి వరకు పోలీస్ స్టేషన్లలో కూర్చొబెట్టడం, రౌడీ షీట్లు ఓపెన్ చేస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. ఎన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్‌సీపీ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎవరు వచ్చినా గెలుపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదే అన్నారు. కూటమి నాయకుల ఎత్తులను ప్రజలు చిత్తు చేయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఏ శక్తి ఆపలేదని స్పష్టం చేశారు. కూటమికి ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు.

పెరటి తోటల పెంపకంతో ప్రయోజనాలు



పెరటితోటల ప్రాధాన్యతను తెలియజేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

చింతకొమ్మదిన్నె : పెరటి తోటల పెంపకంతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని కడప కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శాస్త్రవేత్తలు ప్రశాంతి, మానస తెలిపారు. మండలంలోని ఇప్పపెంట ఎస్సీ కాలనీ మహిళలకు పెరటి తోట పెంపకంపై సోమవారం కడప కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పెరటితోటకు కావలసిన విత్తనాలు, మునగ మొక్కలను ఉచితంగా అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పెరటి తోటలో మొక్కల పెంపకంలో మెలకువలు, అలాగే పెరటి తోటలో పండించిన ఆకుకూరలు, కూరగాయలు తినడం వల్ల మంచి పోషకాలతో కూడిన ఆహారాన్ని పండించుకోవచ్చని పేర్కొన్నారు. పెరటి తోట పెంపకంపై అవగాహన కలిగించి వాటి పరిరక్షణకు పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా మేనేజర్ ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

అలింకో దివ్యాంగుల స్క్రీనింగ్ శిబిరం



దివ్యాంగులకు సహాయ పరికరాల కోసం స్క్రీనింగ్ నిర్వహిస్తున్న వైద్యులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన పులివెందుల మున్సిపాలిటీ, మండల, వేముల మండల పరిధిలోని దివ్యాంగులకు అవసరమైన సహాయ పరికరాల స్క్రీనింగ్ శిబిరం ముగిసింది. ఈ సందర్భంగా కడప జిల్లా వికలాంగుల సంక్షేమశాఖ పునరావాస అధికారి మారెళ్ళ శ్రీకాంత్ తెలుపుతూ మూడు చక్రాల సైకిళ్లు, వీల్ చైర్లు, బ్యాటరీ సైకిళ్లు, శ్రవణ యంత్రాలు, చేతి కర్రలు, వాకర్స్, తదితర ఉపకరణాల కొరకు జరిగిన స్క్రీనింగ్ శిబిరంలో అర్హులైన దివ్యాంగులను గుర్తించి, వారి వైకల్య శాతం ఆధారంగా, వారికి అవసరమైన వివిధ సహాయ పరికరాలను నమోదు చేశారు. అలింకో వైద్య నిపుణులు డాక్టర్ శివ ఆశిష్ పట్నాయక్, డాక్టర్ అన్షుశుక్లా, వికలాంగులశాఖ అధికారి శ్రీకాంత్, దివ్యాంగుల నెట్‌వర్క్ అధ్యక్షులు డాక్టర్ ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

లింగాల : లింగాల మండలంలోని ఎగువ లింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని భారత కృత్రిమ అవయవాల తయారీ సంస్థ (అలింకో) సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు.

గురి తప్పిన డ్రా‘గన్’

ఎన్నో పోషక విలువలున్న డ్రాగన్ ఫ్రూట్ నష్టాల బాట పట్టింది. ఏటా లాభాలందించే పంట ప్రస్తుతం ధరలు లేకపోవడం రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఏ పంటకు నష్టం వాటిల్లినా డ్రాగన్ ఫ్రూట్ సాగు చేసే రైతులు ఆదాయం పొందేవారు. అలాంటిది ఎన్నడూ లేని విధంగా మార్కెట్‌లో ధరలు పడిపోవడంతో కొనుగోలు చేసేందుకు వ్యాపారులు రాక చెట్లపైనే మగ్గిపోవాల్సిన దుస్థితి నెలకొంది.

- తగ్గుముఖం పట్టిన ధరలు
- కొనుగోళ్లు లేక రైతుల ఆందోళన



విక్రయానికి సిద్ధంగా ఉన్న డ్రాగన్ ఫ్రూట్స్

పులివెందుల రూరల్ : సంప్రదాయ పంటలతో పాటు ఆధునిక పంటల సాగుపై రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. కరోనా అనంతరం డ్రాగన్ ఫ్రూట్స్‌కు మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. దీంతో రైతులు డ్రాగన్ పంట సాగు చేసేందుకు మక్కువ చూపుతున్నారు. రైతులకు లాభాలు, ప్రజలకు ఆరోగ్యాలు తెచ్చిపెట్టే డ్రాగన్ ఫ్రూట్స్ పంటకు ప్రస్తుతం మార్కెట్‌లో ధరలు తగ్గిపోయాయి. పులివెందుల నియోజకవర్గ వ్యాప్తంగా పులివెందుల మండలం తుమ్మలపల్లె, సింహాద్రిపురం, లింగాల, వేముల మండలాలోని పలు గ్రామాల్లో రైతులు డ్రాగన్ ఫ్రూట్స్ పంటలను సాగు చేశారు. డ్రాగన్ ఫ్రూట్స్ ధరలు మార్కెట్‌లో ధరలు తక్కువగా ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతుకు దక్కని మద్దతు ధర

వ్యాపారస్తులు, రైతులు వద్దనే కిలో డ్రాగన్ ఫ్రూట్స్ రూ.45ల నుంచి రూ.50లు కొనుగోలు చేసి మార్కెట్‌లో రూ.80 నుంచి రూ.100లకు విక్రయిస్తున్నారు. గత ఏడాది కిలో డ్రాగన్ ఫ్రూట్స్ రూ.200 పలికాయి. గత ఏడాదితో పోలిస్తే ఏడాది డ్రాగన్ ధరలు తక్కువ ఉన్నాయని రైతులు వాపోతున్నారు. రైతులు మాత్రం ఎకరాకు రూ.8 లక్షలు ఖర్చుచేసి పంట సాగు చేస్తే కనీసం పెట్టుబడి కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సిమెంట్ స్తంబాలకు, ప్లేట్లకు డ్రాగన్ మొక్కలు కలిపి సుమారు ఎకరాకు రూ.8 లక్షలు ఖర్చు అవుతోంది. మొదటి రెండేళ్లు పంటలు బాగా పండి అధిక రేట్లు ఉండటంతో డబ్బులు బాగానే వచ్చాయి. కానీ ఈ ఏడాది దిగుబడి ఉన్న ఆదాయం మాత్రం రావడం లేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తగ్గిన డ్రాగన్ ఫ్రూట్స్ ధరలు



ప్రస్తుతం మార్కెట్‌లో డ్రాగన్ ఫ్రూట్స్ ధరలు చాలా వరకు తగ్గిపోయాయి. గత ఏడాది కిలో డ్రాగన్ ఫ్రూట్స్ రూ.200 విక్రయించాం. ఈ ఏడాది జనవరి కిలో డ్రాగన్ ఫ్రూట్స్‌ను రూ.100 విక్రయిస్తున్నాం. దూర ప్రాంతాల నుంచి కొనుగోలు చేసి పులివెందులలో మార్కెట్‌లో విక్రయిస్తున్నాం. అక్కడి నుంచి తెచ్చినా కూడా ఎటువంటి లాభాలు రావడంలేదు. డ్రాగన్ ఫ్రూట్స్ 45రోజుల కంటే ఎక్కువగా నిల్వ ఉండదు. అందువల్ల తెచ్చిన అసలు డబ్బులు వచ్చినా ఫర్వాలేదని కిలో రూ.80 విక్రయిస్తున్నాం.

– సాదక్‌వల్లి, వ్యాపారస్తుడు, పులివెందుల

కూటమి వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళదాం

జమ్మలమడుగు: కూటమి వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళదామని వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు గజ్జల కిరణ్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ డబ్బులను ఆశ చూపి ఓట్లు దండుకోవాలని ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

డీజిల్ చోరీ

ముద్దనూరు: ముద్దనూరు-తాడిపత్రి జాతీయ రహదారిలో ఓ పెట్రోల్ బంక్ సమీపంలో నిలిపిన ఓ ట్రిప్పర్ నుంచి 80 లీటర్ల డీజిల్‌ను దుండగులు చోరీ చేశారు. ఆదివారం రాత్రి ట్రిప్పర్ డ్రైవరు పెట్రోలు బంకు వద్ద నిలిపి ఇంటికి వెళ్లాడు. ఉదయం వచ్చి చూసేసరికి డీజిల్ ట్యాంకు తాళం పగలగొట్టి డీజిల్‌ను చోరీచేసినట్లు బాధితుడు తెలిపారు.

మైక్ వితరణ

పులివెందుల : పులివెందుల పట్టణంలోని స్థానిక ఎర్రగుడిపల్లెలో రామాలయానికి సోమవారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ మైకు సెట్ వితరణగా అందించారు. వార్డు కౌన్సిలర్ పురుషోత్తం, కోళ్ల భాస్కర్, కో-అప్షన్ మెంబర్ చంద్రమౌళి, సూరి, కృష్ణమూర్తి, నాయకులు పాల్గొన్నారు.